

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 25 అక్టోబర్ 2025 పేజీలు : 04


-అనంత నీటిపారుదల సలహామడలి సమావేశంలో సమయ స్ఫూర్తి

-అన్నీ తానై సభను నడిపించారు

- హెచ్.ఎల్.సి, హంద్రీనీవా అధికారులకు దిశా నిర్దేశం

- హంద్రీనీవా ప్రధాన కాలువ ఎడమవైపు వెడల్పు చేసే విషయం పరిశీలించండి

- టీబీ డ్యాం నీటి కేటాయింపులు దృష్టిలో ఉంచుకోండి

# ఫలించిన పయ్యావుల కేశవ్ ప్రయత్నాలు



మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, అక్టోబర్ 24, (ప్రభాతవార్త బ్యూరో)**

అనంతపురం జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం లో మంత్రి పయ్యావుల కేశవ్ అన్ని తానై సమయస్ఫూర్తితో వ్యవహరించాడు. ఒకవైపు అధికారులకు దిశా నిర్దేశం చేస్తూనే శాసనసభ్యుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని సభను సజావుగా నిరూపించారు. హెచ్.ఎల్.సి, హంద్రీ నీవా అధికారులకు పలు ప్రశ్నలను సంధిస్తూ జిల్లా ప్రయోజనాలు, రైతుల మేలే లక్ష్యంగా మంత్రి పయ్యావుల కేశవ్ సభను నడిపించడం విశేషం. శుక్రవారం అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణ లోని సమావేశ మందిరంలో అనంతపురం జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ తో పాటు రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరాం రెడ్డి, ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, దగ్గుబాటి వెంకట ప్రసాద్, జెసి అస్మిత్ రెడ్డి, బండారి శ్రావణి, హంద్రీనీవా సీఈ నాగరాజు, ఎస్.ఈ. స్వరూప్ కుమార్, హెచ్ ఎల్ సి ఎస్ సి సుధాకర్, తుంగభద్ర బోర్డు ఎస్.ఈ నాయక్ తదితర అధికారులు హాజరయ్యారు. నీటిపారుదల సలహా మండలి సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్ పలు సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించారు. రాజకీయాలకు తావివ్వకుండా జిల్లా అభివృద్ధి, రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలని అధికారులకు సూచించడంతోపాటు తోటి ప్రజా ప్రతినిధులకు కూడా విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి మధ్య హంద్రీ నీవా ప్రాజెక్టు విషయంలో కొద్దిసేపు మాటల యుద్ధం మొదలైంది. మా ప్రభుత్వంలో ఇది చేశారంటూ ఒకరు ఈ ప్రభుత్వంలో చేయలేదు మా ప్రభుత్వంలోనే జరిగిందని మరొకరు అనుకునేందుకు యత్నించారు. ఆ సమయంలో ఈ సమావేశంలో రాజకీయాలు వద్దు.. రైతులకు ఎన్నో మేలు చేసేందుకు, జిల్లా అభివృద్ధికి ఇంకా అదనంగా చర్యలు తీసుకునేందుకు చర్చిద్దాం అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ మిగతా 3 లో...

# ఆయకట్టుదారుల అభిప్రాయం మేరకే సాగునీటి విడుదల

- బిటిపికి కృష్ణా జలాలను ఈసారి తప్పక తీసుకొస్తాం. - బిటిపి రైతులకు ఎమ్మెల్యే కాలవ భరోసా





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు అమిలినేని, కాలవ, జలహారతి చేస్తున్న ఎమ్మెల్యేలు కాలవ,అమిలినేని తదితరులు

**గుమ్మఘట్ట అక్టోబర్ 24 ప్రభాతవార్త**

భైరవాణి తిప్ప ప్రాజెక్టును కృష్ణ జలాలతో నింపుతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో కలిసి శుక్రవారం ఆయన బీటీపీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది పూర్తి స్థాయిలో రెండు టీఎంసీల నీరు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో రైతుల అభిప్రాయాలు తెలుసుకుని త్వరలోనే ఆయకట్టుకు నీటి విడుదల తేదీని ఖరారు చేస్తామన్నారు. ఏ సమయంలో వదిలితే పంట దిగుబడులు అధికంగా వస్తాయనే విషయం పై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కుడి, ఎడమ పంట కాలువలకు నీటిని విడుదల చేసే తేదీని కూడా త్వరలో ఖరారు చేస్తామన్నారు. దశాబ్దాల కాలంగా ఈ ప్రాంత ప్రజల జీవితాలతో బీటీ ప్రాజెక్టు ఒక ఎమోషన్ లాంటిదన్నారు. కర్ణాటక ప్రాంతంలో భారీ వర్షాలు కురియడంతో పైనున్న వాణి విలాస్ ప్రాజెక్టు నిండిందన్నారు. దాంతో బిటిపి కి క్రమంగా నీరు పెరుగుతోందన్నారు. మూడు వేల క్యూసెక్కుల నీరు వస్తాయనీ అంచనా వేయగా కేవలం 600 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నట్లు వివరించారు. కర్ణాటక పరిధిలో చెక్ డ్యాములు, డైవర్షన్ చానల్స్ ద్వారా వారు చెరువులు నింపుకుంటున్నారన్నారు. 600 క్యూసెక్కుల నీరు ఇలాగే అందితే మరో ఆరు రోజుల్లో పూర్తి స్థాయిలో రిజర్వ్ కు నీరొస్తాయన్నారు. కాబట్టి రైతు సోదరులు అన్నదమ్ముల్లా ఐకమత్యంగా నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో కలిసి కృష్ణా జలాల తరలింపు అంశాన్ని అనేక దఫాలుగా ముఖ్యమంత్రి మిగతా 3 లో...

# ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోండి

- ప్రమాదాల రహిత జిల్లాగా రూపొందించాలి - జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ , సమావేశానికి హాజరైన సంబంధిత అధికారులు

**శ్రీ సత్యసాయి జిల్లా, అక్టోబరు, 24 , ప్రభాతవార్త ప్రతినిధి**

జిల్లాలో రహదారుల భద్రత మరియు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ , జిల్లా ఎస్పీ సతీష్ కుమార్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తో కలిసి జిల్లా స్థాయి రహదారి భద్రతా సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జీరో మృతి కేసులు నమోదు కావడానికి అధికారులందరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ మాసాంతం వరకు జిల్లాలో 429 ప్రమాదాలు జరుగగా, 255 మంది మృతి చెందారని, 233 ప్రాణాంతక కేసులు, 196 ప్రాణాంతకం కానివి, 483 మంది గాయపడినట్లు అధికారులు నివేదించారన్నారు. జిల్లాలోని రహదారుల్లో బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు పూర్తి స్థాయిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు. మలుపుల వద్ద జంగిల్ క్లియరెన్స్ లు ఎప్పటికప్పుడు చేయడం వల్ల కూడా ప్రమాదాల సంఖ్య తగ్గుతుందని ఆ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి బ్లింకర్స్, ఫ్లాషెస్ ఏర్పాటు చేయాలి. జిల్లా నుంచి వెళ్లే ఎన్ హెచ్ రహదారులలోని అన్ని మీడియన్ ప్రాంతాలలో లైటింగ్ ఏర్పాట్లు పెంచాలన్నారు. అదే విధంగా ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్స్, సైన్ బోర్డ్స్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పాలసముద్రం క్రాస్ వద్ద ట్రక్ లే బై ఉండి కూడా వాడడం లేదని దృష్టికి వచ్చిందని దాన్ని వాడుకులోకి తీసుకురావాలని సూచించారు. ఎన్ హెచ్ వారీగా ట్రక్ లే బై ఎన్ని ఉన్నాయి, అక్కడ సూచిక బోర్డులు ఉన్నాయా లేవా అన్న వివరాలను ఎన్హెచ్, సర్వే, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంగా గుర్తించి తదుపరి సమావేశంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ లలో ప్రమాదాల నివారణకు పెద్ద పరిమాణంలో సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. రంబుల్ స్ట్రిప్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. పాఠశాల బస్సులకు రివర్స్ చేసేటప్పుడు రేర్ కెమెరా ఉండాలని నిబంధనలను చెబుతున్నాయని, ప్రతి పాఠశాల బస్సు కు రేర్ కెమెరా ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించి, ఈ మేరకు పాఠశాల యాజమాన్యం నుంచి సర్టిఫికెట్ పొందాలని డిటిసి మరియు డీఈఓ లను ఆదేశించారు. హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదు. ముఖ్యంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని అలా చేసిన వారికి జరిమానాలు విధించాలన్నారు. ఈ అంశంపై రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని ఇందుకు సోషల్ మీడియాను కూడా ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమర్థవతమైన సిబ్బంది ఉండేలా చూడాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. జిల్లాకు అవసరమైన స్పీడ్ గన్స్ అందజేయాలని ఉన్నతాధికారులకు లేఖ సిద్ధం చేయాలని జిల్లా రవాణా శాఖ మిగతా 3 లో...

# హెచ్ఎన్ఎస్ఎస్ కాలువను ఎంత మేరకు వెడల్పు చేయగలం అనేది స్టడీ చేయండి




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

- హంద్రీ నీవా నీటిని 50 టీఎంసీలు తేవాలని లక్ష్యంగా పెట్టుకోండి
- తక్కువగా ఉన్న టీబీ డ్యాం నీటి కేటాయింపులను దృష్టిలో పెట్టుకోండి
- ఆయకట్టు రైతులకు ఇబ్బంది రాకుండా హంద్రీ నీవా, హెచ్ఎల్సీ నీరు వాడకంపై యాక్షన్ ప్లాన్ రూపొందించండి.
- నీటిపారుదల సలహా మండలి సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులకు దిశా నిర్దేశం
- హంద్రీ నీవా కాలువ వెడల్పు, లైనింగ్ కు నిధులు ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు సమావేశంలో అభినందనలు



**అనంతపురం, అక్టోబర్ 24 (ప్రభాతవార్త బ్యూరో)**

శ్రీశైలం జలాశయం లోతట్టు ప్రాంతం మల్యాల వద్ద నుంచి అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్ వరకు హంద్రీ నీవా ప్రధాన కాలువను ఎడమవైపు ఏ మేరకు వెడల్పు చేయొచ్చు అన్నది స్టడీ చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. ప్రధాన కాలువ వెడల్పు కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే కుడివైపు చేశారని, ఎడమవైపు ఏ మేరకు చేయవచ్చు అన్నది పరిశీలించాలని హంద్రీ నీవా చీఫ్ ఇంజనీర్ నాగరాజు, ఎస్ ఈ స్వరూప్ కుమార్ ప్రత్యేక బాధ్యతలు తీసుకొని స్టడీ చేయాలని ,, హంద్రీ నీవా నుంచి 50 టీఎంసీల నీరు ప్రతి ఏటా తెచ్చేందుకు ప్రణాళిక లు రూపొందించాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. అనంతపురం నగరంలోని జడ్పీ కాంపౌండ్ లో ఉన్న డి.పి.ఆర్.సి మీటింగ్ హాల్లో శుక్రవారం నిర్వహించిన జిల్లా నీటిపారుదల సలహా బోర్డు సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అలిమినేని సురేంద్రబాబు, సాగునీటి సలహా మండలి సభ్యులు, మిగతా 3 లో...





# రోడ్డు భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

**అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 24 ప్రభాతవార్త**

జిల్లాలో రోడ్డు భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రతా సమావేశాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ కి ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్ స్థలాలను గుర్తించాలని, నగరపాలక సంస్థ, ట్రాఫిక్ అ ది. కా ో ు ల ు జాయింట్ తనిఖీ చేసి ప్రైవేట్ భూములను కూడా గుర్తించాలన్నారు. గుత్తి గుంతకల్లు రోడ్ లోని రోడ్ మరియు ఆర్ఓబిని, రాప్తాడు వద్ద రైల్వే లైన్ ఉన్న బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా బస్సులను ఆపేందుకు గుర్తించిన స్థలాల్లోనే మార్కింగ్ వేసి అక్కడే బస్సులు నిలిపేలా మున్సిపల్ కమిషనర్ తో సమన్వయం చేసుకొని ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ఐసి వారు మిగతా 3 లో...

# పాఠశాలల్లో అడ్మిషన్లు ... ఇంట్లో విద్యార్థులు..!

- కోచింగ్ సెంటర్ పేరుతో అనధికారకంగా ప్రైవేట్ స్కూలును నడుపుతున్న ఉపాధ్యాయుడు
- ఏళ్లుగా సాగుతున్న వ్యవహారం - తెలిసినా పట్టించుకోని ఎంఈఓలు,
- డీవైఈఓ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలో వెలుగులోకి - ఉపాధ్యాయుడును కాపాడేందుకు రంగంలోకి పలువురు





కోచింగ్ సెంటర్ లో యూపీ స్కూల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులతో అధికారులు , కోచింగ్ సెంటర్ లో విచారణ చేస్తున్న అధికారులు

**అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 24 ప్రభాతవార్త**

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి చాలా గౌరవం ఉంది. అలాంటి గౌరవప్రదమైన ఉపాధ్యాయుడు అదనపు సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. తాను పనిచేసే పాఠశాలతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని పలువురు విద్యార్థులకు తన ఇంట్లోనే పాఠాలు చెబుతున్నారు. ఈ వ్యవహారం మొత్తం డిప్యూటీ డీఈఓ ఆకస్మిక తనిఖీలో వెలుగులోకి వచ్చింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలో పవర్ ఆఫీస్ ఎదురుగా నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు హరికృష్ణ బ్రహ్మసముద్రం మండలం గొంచిరెడ్డిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్నారు. ఆయన అదనపు సంపాదన కోసం ట్యూషన్, కోచింగ్ సెంటర్ పేరుతో అనధికారకంగా సెమీ రెసిడెన్షియల్ తరహాలో ప్రైవేట్ స్కూలును నడుపుతున్నారని ఆ ప్రాంతంలోని ఉపాధ్యాయులు ద్వారా అందిన సమాచారం. ఆయన పనిచేసే పాఠశాలతో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలలు, పలు ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు తన ఇంట్లోనే ప్రతిరోజు ఉదయం 7 నుండి 8 గంటల వరకు పాఠాలు చెబుతున్నారు. ఆ తర్వాత తాను పనిచేసే పాఠశాలకు వెళ్తున్నారు. ఆ సమయంలో తన భార్య రివిజన్ చేయిస్తుంది. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు వచ్చి అప్పటి నుండి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. ఆయన పనిచేస్తున్న పాఠశాలలో అడ్మిషన్లు పొందిన పదుల సంఖ్యలోని విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలలకు వెళ్లడం లేదు. ఆయా తరగతుల టీచర్లు ప్రతిరోజు ఆయా విద్యార్థుల అటెండెన్స్ వేయాల్సి ఉంది. ఆ పాఠశాలలో అడ్మిషన్లు ఉన్న విద్యార్థులు ఆ టీచర్ ఇంట్లో చదువుకుంటున్నారన్న విషయం తెలుసుకున్న కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు దీనిని వ్యతిరేకించారు. ఈ సమస్యతో అక్కడ ఇద్దరు సీనియర్ టీచర్లు ఉన్నప్పటికీ వారు హెచ్ఎం గా బాధ్యతలు తీసుకోవడానికి ముందుకు రాలేదు. దీంతో ఆ టీచరే హెచ్ఎం గా బాధ్యతలు స్వీకరించి కొనసాగుతున్నారు. దీంతో ఆయనే ప్రతిరోజు అన్ని తరగతుల విద్యార్థుల అటెండెన్స్ వేస్తున్నారు. పాఠశాలకు రాని విద్యార్థుల పేర్లను తొలగించాలని కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు ఆ టీచర్ ను అడిగితే పట్టించుకోకుండా చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చే వారిని వారికి తెలిసిన ఇతర పాఠశాలల ఉపాధ్యాయులకు చెప్పి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఆయనతో ప్రతిరోజు గొడవ కూడా పడుతున్నారు. ఆయన వ్యవహారాన్ని ఒక మహిళ టీచర్ మినహా మిగిలిన టీచర్లు అందరూ వ్యతిరేకిస్తున్నారు. విద్యార్థుల పేర్లు అడ్మిషన్లు తొలగిస్తే తన పోస్ట్ పోతుందో అని ఉద్దేశంతోనే ఆ మహిళా టీచర్ ఆ ఉపాధ్యాయుడికి సపోర్ట్ చేస్తున్నట్లు సమాచారం. అయితే మిగతా 3 లో...

# వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాల పేరిట మోసం..!

-నిరుద్యోగ యువకులతో డబ్బులు దండుకొంటున్న బోగస్ కంపెనీ-జాబ్ ఐడీ కోసం డిపాజిట్ పేరుతో వేలాది రూపాయలు వసూళ్ళు-రూ.450 నుంచి రూ.12వేలు వసూళు చేసుకొని చేతిలెత్తేసిన కేటుగాళ్ళు-తాను మోసపోయిన వైనాన్ని వాట్సాప్ గ్రూప్‌లోనే వివరించిన ఓ బాధితుడు












ఒక వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన ఉద్యోగాలు ఇస్తామన్న మెసేజ్, వివరాలు వెల్లడిస్తున్న పట్టణానికి చెందిన బాధిత యువకుడు, బాధితుడు కంపెనీ ప్రతినిధితో చేసిన వాట్సాప్ చాట్ దృశ్యాలు

**ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త**

వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాల పేరిట అమాయకులైన నిరుద్యోగులకు గాలం వేసి వారి నుండి వందలు మోదలు వేలాది రూపాయలు వసూళు చేసుకొని ముఖ ం చాటేశారు కొందరు కేటుగాళ్ళు. ఇంట్లోనే ఉండి నాలుగైదు గంటలు పనిచేస్తే చాలు నెలకు సులభంగా 35వేల రూపాయలు వరకు డబ్బులు సంపాధించుకోవచ్చని అమాయకులైన నిరుద్యోగులను టార్గెట్‌చేసి డబ్బులు వసూళు చేసుకొని వారికి పంగనామాలు పెట్టేశారు కొందరు ఘరానా దొంగలు. సామాజిక మాధ్యమం వాట్సాప్ వేదికగా జరిగిన ఉద్యోగాల కల్పన మోసానికి బలైన ఉరవకొండకు చెందిన పలువురు బాధిత నిరుద్యోగ యువకులు వెల్లడించిన మేరకు వివరాల్లోకి వెళితే.. ఉరవకొండకు చెందిన ఒక వాట్సాప్ గ్రూప్‌లో ఒక కంపెనీ పేరుతో ఇంటి దగ్గర ఖాళీగా ఉన్నారా ఇతే మా కంపెనీలో ఖాళీలు ఉన్నాయి, రోజుకు కేవలం 4 గంటలు కేటాయిస్తే చాలు ఇంటివద్ద ఉండే ఫోన్ కాల్స్ మాట్లాడి 13,000 రూపాయల నుండి 35,000 రూపాయల వరకు సంపాధించుకోవచ్చు, 10వ తరగతి పాసై 18 నుంచి 40 సంవత్సరాలలోపు వయసుగల వారైతే చాలు అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో అనేక మంది నిరుద్యోగ యువత వెంటనే స్పందించారు. వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన కాంటాక్ట్ నంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడిన ఉరవకొండ పట్టణానికి చెందిన ఒక నిరుద్యోగ యువకుడికి సదరు కంపెనీ ప్రతినిధి మీరు ఇంటి నుండే ఉద్యోగం చేయవచ్చని రోజుకు 20 నుంచి 25 ఫోన్ కాల్స్ అటెమ్ట్ చేస్తే 15వేల రూపాయల దాకా జీతం వస్తుందని ఆదివారం పనిచేస్తే అదనంగా చెల్లిస్తామని నమ్మబలికాడు. మీ ఆధార్, పాన్ కార్డులు, ఈ-మెయిల్ ఐడీ పంపాలని హెడ్ ఆఫీస్‌కు వెరిఫికేషన్ పంపుతామని ఆపై మిగతా 3 లో...

## నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు

డి.హిరెహాళ్ అక్టోబరు 24 ప్రభాతవార్త



నూతన దంపతులతో వాల్మీకి సంఘం అధ్యక్షులు

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప వివాహ వేడుకల్లో పాల్గొని నూతనదంపతులను ఆశీర్వదించారు.



కర్ణాటక బళ్ళారి ఎంపి, సండూర్ ఎమ్మెల్యే లతో వాల్మీకి సంఘం అధ్యక్షులు

శుక్రవారం ఆయన మిత్రుల తో కలిసి కర్ణాటక విజయనగరం జిల్లా హోసపేటలోని విజయశ్రీ రిసార్ట్‌లో నిర్వహించిన ఏవన్‌క్లాస్ కాంట్రాక్టర్ బసవరాజు ఆహ్వానం మేరకు వివాహ కార్యక్రమంకు హాజరయ్యారు. ఈ మేరకు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులు సాలి విద్యశ్రీ, ఎం.అనూప్ లను ఆశీర్వదించి ఆశీస్సులు అందించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నూతన దంపతులతో మాట్లాడుతూ మీ వివాహ జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఎలాంటి మనస్పర్థలకు తావివ్వకుండా మీ జీవితానికి మీరే బంగారు బాటలు వేసుకోవాలని ఆయన వధూవరులకు సూచించారు. మూడుముళ్ల బంధంతో ఒకటైన మీ దాంపత్య బంధం మీ ముందు తరాల వారికి ఆదర్శంగా నిలవాలని ఆయన నూతన దంపతులకు తెలిపారు. ఈవివాహ కార్యక్రమంకు హాజరైన బళ్లారిఎంపీ తుకారాం,సండూర్‌ఎమ్మెల్యే అన్నపూర్ణలను వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి మర్యాదపూర్వకంగా కలిసి పలకరించారు. వీరి మధ్య ఆంధ్ర, కర్ణాటక రాజకీయ విషయాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ లోని ఎనిమిది జిల్లాల్లో జీవనం సాగిస్తున్న వాల్మీకి బోయల ఎస్టీ పునరుద్ధరణ జాబితా విషయమై చర్చకు వచ్చింది. ఈ కార్యక్రమంలో మిత్రులు నాగరాజు, ఎరిస్వామీ, హనుమంతు, గోల్డ్ స్మిత్ విజ్జి తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా



విద్యార్థులతో ఉపాధ్యాయులు అధికారులు

పరిగి అక్టోబర్ 24( ప్రభాతవార్త)

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లో భాగంగా జరిగిన అథ్లెటిక్స్ మండల స్థాయిలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలలకు బాలుర మరియు భాలికలకు, 14మరియు 17 సంవత్సరాల విభాగాలలో జరిగిన, ఇందులో అన్ని రకముల పరుగు పందెములు, త్రోస్, జంప్స్, జరిగినవి ఈ పోటీలలో గెలిచినా విద్యార్థులు నియోజక వర్గ స్థాయి పోటీలలో పాల్గొనడం జరుగు తుందని బీ.కృప సత్యరాజ్ తెలియ జేశారు.

## ప్రభుత్వ నూతన క్వాజి నియామకం

### ఎమ్మెల్యేని సన్మానించిన ముస్లిం సోదరులు



ఎమ్మెల్యేని సన్మానించిన ముస్లిం సోదరులు

కనేకల్లు అక్టోబర్ 24 ప్రభాతవార్త

కనేకల్ మండల ప్రభుత్వ క్వాజిగా మొహమ్మద్ జవిద్ శుక్రవారము రాయదుర్గం ఎంఎల్ఏ కాల్వ శ్రీనివాసులు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకం అందుకున్న మహమ్మద్ జావిద్ రాయదుర్గం శాసనసభ్యులు ప్రభుత్వ విప్పు కాల్వ శ్రీనివాసులను సెలవ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లాలెప్ప, మార్కెట్ యార్డ్ చైర్మన్ రైతు డిపో చాందు భాష , మాజీ ఎంపీపీ మహబూబ్ సాబ్, రిటైర్డ్ టీచర్ షేక్ హుస్సేన్, నురానీ మజీద్ ముత్వల్లి హుస్సేన్ సాబ్, పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

కంబదూరు, అక్టోబర్ 24, ప్రభాతవార్త




కార్యక్రమంలో మాట్లాడుతున్న సిడిపిఓ పద్మావతి

కంబదూరు మండలం తిమ్మాపురం లోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఐసిడిఎస్ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని పేర్కొన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని విద్యార్థినిలకు తెలియజేశారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే ఐసిడిఎస్ అధికారులకు తెలపాలనికోరారు. ఈకార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్‌మానస, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మజ, రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులరెడ్డి, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

## సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తులు చేయించిన ఎంఎల్ఎ

బ్రహ్మ సముద్రం అక్టోబర్ 24 ప్రభాతవార్త



రోడ్డుకు మట్టి వేస్తున్న దృశ్యం

మండల కేంద్రం నందలి ఎర్రప్ప దొడ్డిదగ్గర రోడ్డు గుంతల మయమై రోడ్డు నందు నీరు చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకుడు గొల్ల సన్నప్ప యం ఎల్ ఏ సురేంద్ర బాబు గారి ని చరవానియందు సంప్రదించి రోడ్డు కు మట్టి వేయించ వలసింది గా కోరిన తక్షణం స్పందించి జేసీబీలు. డోజర్ను పంపి మట్టివేయించి రోడ్డుకు మరమ్మత్తులు చేయించిన ఘనత మన ఏం ఎల్ ఏ సురేంద్ర బాబు గారి కే స్వంతమని ఎర్రప్ప దొడ్డి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## రంగయ్యపాళ్యం దారికి మోక్షమెన్నడు

### అబ్బాబ్బా....ఈ రోడ్డు అద్వాన్నం..

### దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న శిలాఫలకం

### ఇప్పటికైనా రహదారి మారేనా...

శెట్టూరు, అక్టోబర్ 24 ప్రభాతవార్త



అద్వాన్నంగా ఉన్న దారి,దిష్టిబొమ్మలా శిలా ఫలకం

గత ప్రభుత్వం లో మాజీమంత్రి రహదారి నిర్మాణానికి 2020 సంవత్సరంలో భూమిపూజ చేసి వదిలేశారు. నేటికి రహదారి అలానేఉంది వేసిన కంకర రాళ్లు కూడా చెల్లుకొనిపోయాయి. కానీ ఇప్పటి వరకు సంబ్బంధితఅధికారులు కానీ నాయకులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని రంగయ్యపాళ్యం గ్రామస్థులు ఆరోపించారు. మండల పరిధిలోని ములకలేడు పంచాయితీ రంగయ్యపాళ్యం గ్రామం నుండి గోవిందనగర్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల పైగా ఉన్న ఈ రహదారి నిర్మాణానికి ఏఐబి పథకం ద్వారా రూ.116.00లక్షలు మంజూరు చేసి2020సం"లో ఆర్భాటంగా భూమిపూజ చేసిన ఆనాటి వైసీపీ పాలకులు ప్రభుత్వం మంజూరు చేసిన సొమ్మునేటికి ఉన్నట్టా.. లేనట్టా.. అని పలు అనుమానాలు ఆ గ్రామ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.నేటికిఐదు సంవత్సరాలు కావస్తున్న అధికార కూటమి ప్రభుత్వం కూడా రహదారి నిర్మాణపనులు చేపడతారా లేదా అన్నసందిగ్ధం లో ఆగ్రామప్రజలకు ప్రశ్నార్థకంగా మారింది.ఈ రహదారిలో రైతులు తమ పొలాల్లోకి కాలినడకన ద్విచక్ర వాహనంపై వెళ్తుంటారు జన సంచారం కూడా ఎక్కువే అయితే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఆగ్రామ ప్రజలకు నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఉన్నదికారుల దృష్టికి తీసుకెళ్లి రహదారి నిర్మాణపనులు చెప్పట్టాలని రంగయ్యపాళ్యం,గోవింద నగర్ వాసులు కోరారు..

## రహదారిని కమ్ముకొన్న పిచ్చిమొక్కలు

### తొలగించే నాదుడు ఎవరు

శెట్టూరు, అక్టోబర్ 24 ప్రభాతవార్త



దారిని కప్పిఉన్న పిచ్చి మొక్కలు

మండల పరిధిలోని ములకలేడు గ్రామం నుంచి అయ్యగార్లపల్లి గ్రామంవరకు ప్రయాణించే ప్రధాన రహదారిని పిచ్చిమొక్కలు కప్పి వేసాయి ద్విచక్రవాహనదారులకు ఎన్నోసార్లు పెద్దపెద్ద ప్రమాదాలు కూడా జరిగాయి అయితే ఆ మొక్కలను తొలగించి వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా చేసే నాథుడు ఎవరూ లేరా అని వాహన చోదకులు చర్చించుకొంటున్నారు.ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి దారివెంబడి ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి వాహన చోదకులను ప్రమాదాల నుండి రక్షించాలని వాహన చోదకులుకోరారు.

## ఆరోగ్య కరమైన జాగ్రత్త లతో పోలియోను అరికట్టవచ్చు

రాయదుర్గం అక్టోబర్ 24ప్రభాతవార్త



మహిళకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆరోగ్య కరమైన జాగ్రత్తలతో పోలియోను అరికట్టవచ్చు నని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ సూచించారు పోలియో ప్రమాదకరమైన శుక్రవారం మండలం లోని మల్లాపురం గ్రామంలో పోలియో పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైరస్‌వల్లవచ్చే వ్యాధిఅని, ఇది ముఖ్యంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందని, పోలియో వైరస్ నాడీ వ్యవస్థను దెబ్బతీసి పక్షవాతం లేదా శాశ్వత వికలాంగత్వం కలిగించే ప్రమాదం ఉందనీ ప్రతి సంవత్సరం అక్టోబర్ 24న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ పోలియో దినోత్సవం జరిపారు పోలియో వైరస్ కాలుష్యమైన నీరులేదా ఆహారంద్వారా వ్యాపిస్తుందని, చెత్త, మలమూత్రాలు బహిరంగ ప్రదేశాల్లో ఉండడం, చేతులు సబ్బు తో కడుక్కోకుండా భోజనం చేయడం వంటి అలవాట్లు ప్రమాదాన్ని పెంచుతాయని తెలిపారు.పోలియో నివారణకు పుట్టినప్పటి నుంచే పిల్లలకు నిర్దిష్ట వ్యవధిలో పోలియో టీకాలు వేయించడం అత్యంత ముఖ్యమని చెప్పారు. ప్రతి సారి భోజనం ముందు, టాయిలెట్ తరువాత చేతులుసబ్బుతో కడుక్కోవాలి, పరిశుభ్రమైన తాగునీరు వాడాలి, ఆహారాన్ని కప్పి ఉంచాలి, చెత్తను సమర్థంగా పారవేయా లనీ, అలాగే మలమూత్రాలను బహిరంగప్రదేశాల్లో వేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్లు ఎర్రిస్వామి, శ్రీనివాసులు, సూర్యనారాయణ, ఏఎన్ఎం పార్వతీ ,ఎంఎల్‌హెచ్‌పీ ప్రమీల పాల్గొన్నారు.

## టెన్త్ టాపర్స్‌కు....ఉమర్ రూ.10 వేల సాయం

### -మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో ఉర్దూ స్కూల్‌లో కార్యక్రమాలు

గోరంట్ల, అక్టోబర్ 24 ప్రభాతవార్త



విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేస్తున్న ఉమర్

గోరంట్ల పట్టణం లోని ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్‌లో గత 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ మైనార్టీ యువ నాయకులు, సమాజ సేవకులు ఉమర్‌ఖాన్ ఆ విద్యార్థులను ప్రోత్సహిస్తూ తన వంతు బాధ్యతగా నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతిల సమక్షంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి మొదటి బహుమతిగా 5 వేలు, రెండవ బహుమతిగా 3 వేలు, మూడవ బహుమతిగా 2 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్‌తో పాటు స్కూల్ కమిటీ చైర్మన్ అజంతుల్లా, నిమ్మల శ్రీధర్, మాజీ సర్పంచు నరేష్, మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి, గిరిధర్‌గౌడ్, ఉమర్‌ఖాన్, ఉత్తమరెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ, కక్కల రఘునాథరెడ్డి, వార్డు మెంబర్ లక్ష్మి నాగరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్‌బాషా, పసుపులేటి శ్రీనివాసులు, సుబ్బరాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ నబిరసూల్, ఫైరోజ్, ఉస్మాన్, ఖలీమ్, సుబహన్, సురేష్, విజి, తదితరులు పాల్గొన్నారు.

## బైరసముద్రం రైతుల కోరికతో కాలువ పూడిక తీయిస్తున్న ఎంఎల్ఎ

బ్రహ్మ సముద్రం అక్టోబర్ 24 ప్రభాతవార్త

మండల పరిధిలోని బైర సమ్ముద్ర గ్రామము రైతుల కోరికమేరక అడిగిన తక్షణం చెలిమేపల్లి గ్రామము బిటిపి మెయిన్ కాలువ నుండి బైర సమ్ముద్ర చెరువు వరకు కాలువ పూడిందని బి టి పి నీరును చెరువు లోనికి మళ్ళించా లంటే కా లువలోని పూడిక తీయించాలని యం ఎల్ ఏ సురేంద్ర బాబు గారి ని అడిగిన తక్షణ స్పందించితనస్వంత నిధులతో పూడిక తీయించ డానికి హిటాచీ నీ పంపి కాలువ యొక్క పూడిక పనులు ప్రరంభించడం జరిగింది.



కాలువ పూడిక తీస్తున్న దృశ్యం

## జగన్ వ్యాఖ్యలపై టిడిపి ధర్నా

హిందూపురం అక్టోబర్ 24 ప్రభాతవార్త



జగన్ దిష్టిబొమ్మ ఊరేగిస్తున్న దృశ్యం

స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణపై వైయస్సార్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు నిరసిస్తూ పట్టణంలో తెలుగుదేశం పార్టీ నిరసన కార్యక్రమం చేపట్టింది. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఆందోళన కార్యక్రమంలో జగన్ దిష్టిబొమ్మను ఊరేగించి ఆయన చిత్రపటాలను చించివేశారు. జగన్ ఫ్లెక్సీ లకు చెప్పులతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దిష్టిబొమ్మను కాల్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మద్యం తాగి అసెంబ్లీకి బాలయ్య వచ్చాడని జగన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా వారు తప్పుపడుతూ నీవు చూసావా అంటూ నిలదీశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ రమేష్, టిఎన్టియుసి పట్టణ అధ్యక్షులు యుగంధర్, మండల కన్వీనర్ రాము, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు

## లేపాక్షిలో జగన్ దిష్టిబొమ్మ దగ్ధం

### -ఎమ్మెల్యే బాలయ్యకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి

లేపాక్షి, అక్టోబర్ 24 ప్రభాతవార్త



జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే బాలయ్యపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రమైన లేపాక్షిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు శుక్రవారం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ అభిలాష్, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, సీనియర్ నాయకులు సూర్యప్రకాష్ తదితరుల్దు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారిస్తుంటే ఇంట్లో కూర్చుని బాలయ్యపై విమర్శలు చేయడం జగన్‌కు మంచి పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యేగా బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించడానికి అసెంబ్లీకి బాలయ్య వెళితే జగన్ బాలయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి తమరు ఏమి చేశారో ప్రజలకు తెలుసన్నారు. జగన్ వెంటనే బాలయ్యకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని టిడిపి నేతలు డిమాండ్‌చేశారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్గం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గంగాధర్, వీరశేఖర్, నాగచంద్రశేఖర్, గనిబిపల్లి శంకర, డిష్ మంజు, బ్యాంకు నాగరాజు, సిద్దలింగప్ప, అశ్వర్థనారాయణ, ఎన్ఆర్ నాగరాజు, గంగిరెడ్డి, నాగమణి, అరుణ, శ్రీరామిరెడ్డి, సిరివరం అనిల్, ఆదినారాయణ, వెంకటప్ప, మూర్తి, చిన్నప్ప, రఘు, రంగా, లోకేష్, నారాయణప్ప, మంజు, బసవరాజు, భాస్కర్‌రెడ్డి, కదిరిప్ప, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

చిలమత్తూరు, అక్టోబర్ 24 ప్రభాతవార్త



నిరసన తెలుపుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

చిలమత్తూరు మండల కేంద్రంలో శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, మండల కోఆర్డినేటర్ రంగారెడ్డి, స్టేట్ ఎస్‌సి కార్పోరేషన్ డైరెక్టర్ బేకరి గంగాధర్, నాయకులు లక్ష్మినారాయణ, గౌరీశంకర్, బాలాజీ, చంద్ర, విశ్వనాథ్, రాజేశ్, పరిటాల వెంకటేశ్, ముద్దన్న, శివప్ప, భాస్కర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కులాల కుంపట్లు పెట్టడం మాజీ ఎమ్మెల్యే వైవిఆర్‌కు తగదు -గుమ్మనూరు ఈశ్వర్

గుత్తి, అక్టోబర్ 24 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్

రాజకీయాలలో కులాల కుంపట్లు పెట్టే రీతిన మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తన తండ్రి గుమ్మనూరు జయరాం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదంటూ ఎమ్మెల్యే తనయుడు, గుత్తి టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మనూరు జయరాం మూడు దఫాలుగా ఎమ్మెల్యే, ఒకసారి మంత్రిగా పనిచేశారని ఆయన గుర్తు చేశారు. తమ పట్ల అసభ్య పదజాలంతో దూషించిన పక్షంలో తమ మార్కు రాజకీయం ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. తమకు వైకాపా రాజకీయాల గురించి అవసరం లేదని, అదే సందర్భంలో తమ పట్ల అకారణంగా దూషిస్తే ఖచ్చితంగా వారి లెక్కలు తేలుస్తామని ఘాటుగా హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, మాజీ చైర్మన్ కత్రిమల ప్రభాకర్, కమ్మసేవా సంఘం అధ్యక్షుడు సూరి, మాజీ సర్పంచు శ్రీనివాసచౌదరి, మాజీ సాగు నీటి సంఘం అధ్యక్షుడు కేశవనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ నిరసనగా కోటి సేకరణ

రొళ్ల అక్టోబర్ 24 ప్రభాతవార్త:



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి శ్రేణులు కోటి సంతకాలఖి ప్రజా ఉద్యమంఖి పోస్టర్ ను శుక్రవారం మడకశిర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప , స్థానిక జడ్పిటిసి అనంతరాజు ఆధ్వర్యంలో రొళ్ల మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు వైద్య,విద్య ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందజేసేందుకు వైసిపి ప్రభుత్వ సంకల్పంతో వైసిపి హయాంలో 17 వైద్య కళాశాలలను అందించడం, ఇపుడు వాటిని పిపిపి విధానంలో ప్రయివేటుకు కట్టబెట్టే కుట్రలను కూటమి ప్రభుత్వం చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రణాళిక గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు చెప్పారు. బిజెపి పాలిత ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ కాలేజీలను ప్రయివేటుకు అప్పగించారా? అని ప్రశ్నించారు. వైద్య విద్య సాధించుకోవాలనే విద్యార్థి భవిష్యత్తు కోసం చేపట్టిన ఈ కోటి సంతకాల ఉద్యమంలో పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి సర్పంచులతో పాటు పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ వైద్యుల సహకారం అభినందనీయం

### -ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



నూతన ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గుంతకల్లు, అక్టోబర్ 24 ప్రభాతవార్త

ప్రైవేట్ వైద్యుల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలో చెత్త సేకరణకు ప్రైవేట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందించిన నూతన ట్రాక్టర్‌కు ఎమ్మెల్యే పూజ చేసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్న వాక్యాన్ని వైద్యులు నిజం చేశారన్నారు. అధికారులు అడిగిన వెంటనే పట్టణ అభివృద్ధికి వారు కూడా ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ విశ్రాంత వైద్యురాలు డాక్టర్ కమలమ్మ, టిడిపి డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, సాయి కృష్ణ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ వెంకటేష్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్‌గుప్తా, డాక్టర్ వీరేష్‌కుమార్, లైఫ్ లైన్ ఆసుపత్రి అధినేత డాక్టర్ జిలాన్, డాక్టర్ కీర్తి కిరణ్‌రెడ్డి తదితరులను ఎమ్మెల్యే శాలువాలు పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్.భవాని, కమీషనర్ నయీమ్ అహ్మద్, అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీదేవి, ఎంఈ ఇంతియాజ్ అలీ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, డిఈలు షబానా, సుమ, ఆర్‌ఐలు ఎర్రిస్వామి, రామాంజనేయులు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మహబూబ్‌బాష, ఏఈలు హరికృష్ణ, సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

### జాయింట్ కలెక్టర్ మోర్యా భరద్వాజ్

శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) అక్టోబరు 24 ప్రభాతవార్త:



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సమావేశానికి హాజరైన అధికారులు

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్ సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందలి కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వినియోగాదరుల రక్షణ మండలి (డిసిపిసి) కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వినియోగాదరుల రక్షణ మండలి లో గల అధికారులు జిల్లా వ్యాప్తంగా వున్న వినియోగదారుల సంఘ సభ్యులు, పౌరసరఫరాల డిప్యూటీ తహసిల్దార్ లు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ జిల్లా నందు



వినియోగదారులు ఎటువంటి మోసాలకు గురి కాకుండా ముఖ్యంగా బంగారు కొనుగోలు చేయునప్పుడు, రైతులు విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు కొన్నప్పుడు జరిగే మోసాలను తూనికలు మరియు కొలతలు శాఖా సిబ్బంది విరివిగా తనిఖీలు నిర్వహించి అరికట్టాలన్నారు. ఆహార కల్తీలు ముఖ్యంగా నూనెలు, కారంపొడులు, డైరీ ఉత్పతులలో కల్తీ జరగకుండా ఆహార భద్రత శాఖా వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా రవాణాలో ప్రయాణికులకు అధిక ధరలకు టికెట్ విక్రయాలను జరగకుండా చూడాలని తెలిపారు. ప్రజలందరూ వారు తీసుకొనే ప్రతివస్తు, సేవలకు బిల్ తప్పని సరిగా తీసుకోనేలా కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ వారు ప్రోత్సహించాలని తెలిపారు. వైద్య శాఖ లో మందుల దుఖానాలలో అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని, అనధికారికంగా నిర్వహిస్తున్న మందుల దుకాణాల పై చర్యలుతీసుకోవాలని ఆదేశించారు.జిల్లా వినియోగదారుల సంఘ సభ్యులు మాట్లాడుతూ.. సత్య సాయి జిల్లా నందు జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రాన్ని, ఆహార నాణ్యత పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చెయ్యాలని కోరారు. వినియోగదారుల హక్కుల పట్ల పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యంతో అవగాహనా కల్పించాలని కోరారు.

## నేడు యోగ, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, ఎంపికలు

బెలుగుప్ప, అక్టోబర్ 24 ప్రభాతవార్త

ఎస్‌జిఎఫ్ బెలుగుప్ప మండలం అండర్-14, 17 బాయ్స్, గర్ల్సల యోగ, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, ఎంపికలు నేడు శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బెలుగుప్పలో ఉదయం 10 గంటలకు జరుగును. కావున బెలుగుప్ప మండల పరిధిలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, యూపీ స్కూల్స్, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులందరూ పాల్గొనవచ్చును. అండర్ 14లో పాల్గొనే క్రీడాకారులు 01-01-2012, అండర్ 17 లో పాల్గొనే క్రీడాకారులు 01-01-2009 జన్మించిన వారై ఉండాలని ఈ పోటీలలో పాల్గొనడానికి వచ్చేవారు మిడ్ డే మీల్స్ ఫామ్, మండల్ లెవెల్ ఎంట్రీ ఫామ్ తప్పకుండా తమ వెంట తీసుకుని రావలెను. శ్రీ మల్లారెడ్డి డిప్యూటీ డిఇఓ గుత్తి ఎంఈఓ2, శ్రీ హరికృష్ణ ఎంఈఓ 1, శ్రీ వెంకట ప్రసాద్ హెచ్‌ఎం, గోపాల్ రెడ్డి పిడి తెలిపారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు

బెలుగుప్ప, అక్టోబర్ 24 ప్రభాతవార్త

మండల పరిధిలో వెంకటాద్రిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల సబ్ ఇన్స్‌పెక్టర్ శివ 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా అమర వీరుల త్యాగాలను మరిచిపోరాదన్నారు. పోలీసు అమరవీరులు సంస్కరణల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా వ్యాసరచన పోటీలలో బాల్య వివాహాలు, సైబర్ క్రైంలపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మట్కా, పేకాట, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గర్భవతులకు అన్నదానం

లేపాక్షి, అక్టోబర్ 24 ప్రభాతవార్త

మండల కేంద్రమైన లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందన్ పౌష్టికాహారాన్ని అందజేశారు. శుక్రవారం లేపాక్షి పిహెచ్‌సిలో 36 మంది గర్భవతులకు డాక్టర్ వెంకటచిరంజీవి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పలు సూచనలు సలహాలు అందజేశారు. మధ్యాహ్నం గర్భవతులకు కరణం రమానందన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

# రైతులకు సకాలంలో రుణాలు ఇచ్చి.. మెరుగైన సేవలందించండి

**- రామగిరి పీఏసీఎస్ సభ్యులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన - అట్టహాసంగా రామగిరి పీఏసీఎస్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం - బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్న సునీత**

రామగిరి, అక్టోబర్ 24 ప్రభాతవార్త

రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు అందించి మెరుగైన సేవలంది ంచాలని రామగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్) సభ్యులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. శుక్రవారం రామగిరి మండల కేంద్రంలో పీఏసీఎస్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా సాగింది. ఛైర్మన్‌గా కె.ముత్యాలప్ప, సభ్యులుగా నాగరాజు, చంద్రాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ అయినా లేదా ఇతర సభ్యులు అయినా ఈ పదవుల్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలను అందించాలన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. రుణాల విషయంలో గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు పునరా వృతం కాకూడదన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రుణాలు అందాల న్నారు. బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.


పీఏసీఎస్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత


పిఏసిఎస్ సభ్యులు

# హత్య కేసులో ఒకరికి యావజ్జీవ కారాగార శిక్ష, - రూ. 2 వేలు జరిమాన

అనంతపురం కలెక్టరేట్ అక్టోబర్ 24 ప్రభాతవార్త

అనంతపురం మొదటి అడిషనల్ సెషన్స్ జడ్జి శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఏపిపి, దర్యాప్తు అధికారులను మరియు కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులను జిల్లా ఎస్పీ పి జగదీష్ అభినందించారు కళ్యాణదుర్గం పట్టణం మారంపల్లి కాలనీ చెందిన బోయ రాజశేఖర్ కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష మరియు 2 వేల రూపాయలు ఫైన్ వేశారు . అడిషనల్ డిస్టిక్ సెషన్స్ జడ్జి సత్యవాణి శుక్రవారం తీర్పు ఇచ్చారు. అదే కాలనీ చెందిన తలారి నాగరాజు హత్య కేసులో ఈ శిక్ష పడింది. కేసు పూర్వాపరాల్లోకి వెళితే జూన్ 19 2020 సంవత్సరంలో సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో తలారి నాగరాజు తన స్నేహితులైన చాకలంజి మరియు బోయ రాజశేఖర్ కలసి పీరా బాబా ఇంటి వెనకాల ఉన్న రాయి దగ్గర జూద మాడుతుండగా డబ్బులు విషయంలో గొడవ జరిగింది.

బోయ రాజశేఖర్ కట్టె తీసుకొని తలారి నాగరాజు తల పైన బలంగా కొట్టడం వల్ల రక్త గాయం కలిగి స్పృహ తప్పి పడిపోయాడు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ పొందుతూ అదే రజు చనిపోయాడు. ఈమేరకు హతుడి భార్య తలారి ఉష ఫిర్యాదు చేయడంతో అప్పటి కళ్యాణదుర్గం రూరల్ సీఐ శంకర్ నాయక్ హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టా రు. ఆతర్వాత వచ్చిన సి.ఐ ఎస్. తేజ మూర్తి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తర పున 10 మంది సాక్షులను విచారించగా నిం దితుడు బోయ రాజశేఖర్ పై నేరం ఋజువు కావ డంతో అతనికి యావజ్జీవ కఠి న కారా గార శిక్ష పడింది. ప్రాసిక్యూషన్ తర పున ఏపీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. కేసులో బలమైన సాక్ష్యాలు సేకరించి నింది తులకు శిక్ష పడేలా అప్పటి సిఐలు శివ శంకర్ నాయక్ మరియు తేజోమూర్తి కృషిచే శారు. కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ విజయభాస్కర్ గౌడ,కానిస్టేబుళ్లు కృష్ణ మోహన్, రామమోహన్, రజాక్ ,లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు సాక్షుల ను కోర్టుకు సకాలంలో హాజరు పెట్టడంలో గట్టిగా కృషి చేశారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన అందరిని జిల్లా ఎస్పీ పి జగదీష్ అభినందించారు .


జిల్లా ఎస్పీ పి ,జగదీష్

# గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే.. కాలనీల్లోకి నీరు వస్తోంది

**విశ్వశాంతి నగర్ లో ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ - అధికారులు కాలనీవాసులతో మాట్లాడిన ఎమ్మెల్యే - వచ్చే వర్షాకాలంకి శాశ్వత చూపిస్తామన్న ఎమ్మెల్యే**

అనంతపురం రూరల్,అక్టోబర్ 24 ప్రభాతవార్త

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ప్రస్తుతం వర్షాలకు కాలనీల్లోకి నీరు చేరుతోందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయన రుద్రంపేట పంచాయతీలో ముంపుకు గురైన విశ్వశాంతి నగర్ లో పర్యటించారు. అధికారులు స్థానిక టిడిపి నాయకులతో కలసి కాలనీ మొత్తం తిరిగారు. అక్కడ ఎంత మేర నీరు వచ్చిందని ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్నది ఆరా తీశారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కాలనీవాసులకు చూపించారు. అలాగే అధికారులు కూడా అందు బాటులోఉండాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంలో అనంతపురం నగరంలో భారీ వర్షం వచ్చి చాలా కాలనీలు నీట మునిగాయన్నారు. అప్పట్లో కొందరు వైసీపీ నాయకులు ఆక్రమణల వలన ఇబ్బందులు వచ్చాయన్నారు. వంకల్లో ఎక్కడా పూడికతీయకపోవడం వలనకాలనీల్లోకినీరువచ్చిందన్నారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నామన్నారు. వంకలకు ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు,పంపామని...త్వరలోనేఅవిమంజూరవుతాయన్నారు. అకలంగా కురిసిన ఈ వర్షాలకు కాలనీలోకి నీరు వచ్చిందని.. కేవలం 50 కుటుంబాలకు మాత్రమే ఇబ్బంది కలిగిందన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వచ్చే వర్షాకాలానికి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివాకర్, గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శియు. హీదయ తుల్లా, స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


వర్షపు నీరు చేరిన విశ్వశాంతి నగర్ లో పర్యటించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

# నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**- ఫ్లై ఓవర్ బ్రిడ్జిల సమస్యను ఏడాదిలో పరిష్కరిస్తాం - సీపీఐ దీక్షల విరమింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే**

గుంతకల్లు, అక్టోబర్ 24 ప్రభాతవార్త

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. మున్సిపల్ కార్యాలయం ముం దు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న సామూహిక రిలే దీక్షలను శుక్రవారం ఎమ్మెల్యే విరమింపజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాయంతో నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. సత్యనారాయణ పేట బ్రిడ్జిని తొం దరలోనే విస్తరించి, ధర్మవరం గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జిని కూడా ఏడా దిలో పూర్తి చేస్తామన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు కూడా మం జూరు చేయించడం జరిగిందని చెప్పారు. గత పాలకులు కేవలం టెండర్లు పిలిచి హడావిడి చేశారని విమర్శించారు. అలాగే ఆలూరు, ఉరవకొండ రోడ్లతో పాటు, మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లకు కూడా మరమ్మతులు చేపడతామన్నారు.

నియోజకవర్గంలోని 12 చెరువులకు నీరు అందిస్తామని పునరుద్ఘా టించారు. భక్తుల విరాళాలతో కసాపురం ఆలయాన్ని 10 కోట్లతో శాశ్వతంగా గుర్తుండేలా అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిం దన్నారు. అభివృద్ధికి తాను ఎప్పుడూ ముందుంటానన్న ఎమ్మెల్యే కమ్యూనిస్టులు కూడా సహకరించాలని కోరారు. అంతకుముందు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నియోజ కవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజలు సౌకర్యవంతంగా ఉండేలా కృషి చేయాలని కోరారు. అనంతరం 11 రోజు లుగా కొనసాగుతున్న రిలే దీక్షలను ఎమ్మెల్యే నిమ్మరసం ఇచ్చి విరమిం పచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మ నూరు నారాయణస్వామి, మం డల కన్వీనర్ రామన్న చౌదరి, డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, నాయకులు బండారు ఆనంద్, మున్సిపల్ కౌన్సెల్ మెంబర్ న్యాయవాది కృష్ణారెడ్డి, నాయకులు ఆమ్లెట్ మస్తాన్‌యా దవ్, నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనం ద్‌రెడ్డి, నాయకులు ఫజులు, మాతృనాయక్, చిప్పగిరి ప్రతాప్, సీపీఐ నాయ కులు గోవిందు, మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎం డి గౌస్, మండల కార్యదర్శి రాముదాయల్, సహాయ కార్యదర్శి రామాం జనేయులుయాదవ్, నాయకులు ఈశ్వరయ్య, దాసరి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


నిమ్మరసం తాగించి దీక్షను విరమింపజేస్తున్న ఎమ్మెల్యే

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 28న నిరసన ర్యాలీ

**- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సృష్టించిన ఆస్తులను తెగనమ్ముతున్న కూటమి ప్రభుత్వం - రాబోవు రోజుల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరంచేసేలా ప్రభుత్వం కుట్ర - రూ.3.30 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.4వేల కోట్లు వైద్య కళాశాలలకు కేటాయించలేరా? - మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి - పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 'వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం' పోస్టర్ల ఆవిష్కరణ**

ఉరవకొండ, అక్టోబర్ 24 ప్రభాతవార్త

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా ఈనెల 28వ తేదీన నియోజకవర్గ కేంద్రంలో నిరసన ర్యాలీ జరుగుతుందని ఇందులో ప్రైవేటైజేషన్‌ను వ్యతిరేకించే పార్టీలు, ప్రజా, విద్యార్థి, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 'వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సంపద సృష్టిస్తా, ప్రభుత్వ ఆదాయం పెంచి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ఎన్నికల హామీలను నెరవేరుస్తామని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అయితే నేడు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సృష్టించిన ప్రభుత్వ ఆస్తులను తెగనమ్ము తోందని విమర్శించారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులను తట్టుకొని దేశంలో ఎక్కడా లేనివిధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశా లల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో 5 కళాశాలలు ప్రారంభం కాగా అందులో విద్యార్థులు ద్వితీయ సంవత్సరం వైద్య విద్యను అభ్యసిస్తున్నారన్నారు. పులివెందుల కళాశాలకు మెడికల్ కౌన్సిల్ అనుమతించిన సీట్లను కూడా కూటమి ప్రభుత్వం వెనక్కు పంపిందని వాపోయారు. ఈ ఏడాది కనీసం 10 కాలేజీల్లో తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా దురుద్దేశంతో ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. పీపీపీ విధానం ద్వారా మెడికల్ కాలేజీల భూములను ఎకరం 100 రూపాయల చొప్పున కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర చేస్తోందని దీనివల్ల ప్రజారోగ్యానికి భరోసా కరువై రాబోవు రోజుల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుందన్నారు. అమరావతి పేరుతో 1.30 లక్షల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం 3.30 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో మెడికల్ కాలేజీల నిర్మాణానికి కేవలం 4వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టకపోవడం దారుణమన్నారు.

**నకిలీ మద్యం సూత్రదారులు టీడీపీ నాయకులే :** రాష్ట్రంలో బయటపడ్డ నకిలీ మద్యం సూత్రదారులు టీడీపీ నాయకులేనని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జులు, క్రియాశీలక నాయకులు నగ్నంగా దొరికిపోయినా అరెస్టులు కూడా జరుగలేదని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో అనేక కేంద్రాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు నడుస్తున్నాయని ప్రజల ఆరోగ్యాన్ని పనంగాపెట్టి లైసెన్సు మద్యం దుకాణాల్లో సైతం నకిలీ మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మద్యం అమ్మకాలతో ప్రభుత్వ ఖజానాకు ఎంత ఆదాయం సమకూరుతోందో అంతకంటే ఎక్కువ ఆదాయం నకిలీ మద్యం అమ్మకాల ద్వారా టీడీపీ నేతలు ఆర్జిస్తున్నా రన్నారు.

**రైతు సమస్యలపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి రైతు సమస్యలపై చిత్తశుద్ధిలేదని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. రైతుల పండించిన పంటలకు మద్దతు ధర లేదని, రబీ పంట కాలం ప్రారంభమై నెల కావొస్తున్నా రాయితీ పప్పుశెనగ పంపిణీ ఊసే లేదన్నారు. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో పప్పుశెనగ సాగవుతుందని 25శాతం రాయితీతో అంది స్తామన్న పప్పుశెనగను ఇప్పటివరకు పంపిణీ చేయకపోవడంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో విత్తనం కొని పంట పెట్టుకుంటున్నారని ఆయన వాపో యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం.నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, నాయకులు ఎం.అశోక్‌కుమార్, రాయంపల్లి ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, ఎం.బసవరాజు, ఏ.సి.ఎర్రిస్వామి, జోగి వెంకటేష్, కొడికి గోవిం దు, బి.ఆసిఫ్, వెంకటేష్, జి.వన్నూరుసాబ్, కమ్మటి రామాంజినేయులు, పచ్చి రవి, ధనుంజయ, వడ్డే ఆంజినేయులు, వేమయ్య, బి.మల్లికార్జున, డిష్ సురేష్, చిన్నభీమ, చిన్నముష్టూరు నరేష్, జోగి విజయ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 28న జరిగే నిరసన ర్యాలీ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ అండర్-19లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

**- అభినందించిన రవికాంత్ రమణ**

అనంతపురం సిటీ, అక్టోబర్ 24 ప్రభాతవార్త

రాష్ట్రస్థాయి అండర్-19 అథ్లెటిక్స్ విభాగంలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటడం అభినందనీయమని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు మీనాక్షి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవికాంత్ రమణ కొనియాడారు. ఈ నెల 22, 23న పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో నిర్వహించిన అండర్ -19 అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలలో ఋతిభ కనబర్చి మెడల్స్ సాధించిన క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మీనాక్షి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవికాంత్ రమణ హాజరయ్యారు. ట్రిబుల్ జంప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన శకుంతల, 6కి.మీ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిన హర్షవర్దన్, 1500, 800, 100 మీటర్ల విభాగాల్లో సిల్వర్ మ ఎడల్ సాధించిన భవ్యశ్రీ, శ్వేత, శకుంతల, 400 రిలేలో సిల్వర్ మెడల్ సా ధించిన అమూల్య, సోఫియా, శకుంతల, శ్వేత, 800 మీటర్లలో బ్రౌంజ్ సాధించిన అజయ్‌నాయక్, 3 కిలోమీటర్లలో బ్రౌంజ్ సాధించిన హరహావర్దన్, రేస్వాక్‌లో బ్రైంజ్ సాధించిన ప్రకాష్‌కుమార్, లాంగ్ జంప్‌లో బ్రౌంజ్ సాధించిన శకుంతల, 1500 మీటర్లలో ప్రతిభ సాధించిన ప్రతిభలను ఈ సం దర్భంగా ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన క్రీడా కా రులను ప్రోత్సహించారు. కార్య క్రమంలో ఎజిఎఫ్ కార్యద ర్శిలు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, కోచ్, మేనేజర్లు ఇబ్ర హీం, భార్గవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న రవికాంత్ రమణ

# స్త్రీ శిశు సంక్షేమం..మాటలకే పరిమితం

**ః తాడిపత్రిలో పదకొండ్నురేళ్లకే బాలికకు వివాహం ః 4 నెలల తరువాత బాల్య వివాహం బహిర్గతం**

తాడిపత్రి, అక్టోబరు24, ప్రభాతవార్త ః

బాల్య వివాహం ఓ సాంఘిక దురాచారమని, అది ఓ నేరమని, బాల్య వివాహ రహిత రాష్ట్రమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రతిజ్ఞలు చేస్తున్న అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఆ స్థాయి కృషిని కొనసాగించలేకపోతోందనే అపవాదును మూట గట్టుకుంటోంది. 8 నెలల తరువాత నిన్న వెలుగులోకి వచ్చిన యాడికి మండలంలోని అవివాహిత బాలిక ప్రసవాన్ని మరవక ముందే తాడిపత్రి మండలంలో బాల్యవివాహం జరిగిన సంఘటన నాలుగు నెలల తరువాత వెలుగులోకి రావడం సంబంధిత అధికారుల తీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

తల్లిదండ్రులిద్దరూ విడివిడిగా ఉంటూ తమ కూతురును బుక్కరాయ సముద్రం సమీపంలోని ఓ ప్రభుత్వ సదనంలో అనాథగా వదిలేయగా..ఆ బాలికపై కన్నేసిన కావేటి సముద్రానికి చెందిన ఒంటేరు రమణారెడ్డి అనే ఆటో డ్రైవర్ వివాహం చేసుకున్నట్లు తెలిసింది. 11 ఏళ్ల 10 నెలల వయసున్న ఆ బాలికను ఈ ఏడాది జూన్ 27న గోరుమానుపల్లి సమీపంలోని లొక్కి గుండం శివాలయం వద్ద పూజారి చేతుల మీదుగా రమణారెడ్డి వివాహమాడినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఆ బాలిక వయసు 12 సంవత్సరాల 2 నెలలు అని, వారి వివా హం జరిగి 4 నెలలు పూర్తయిందని, ఆ బాలిక గర్భందాల్చకుండా నివారిం చడమే ప్రస్తుతం తమ ముందున్న లక్ష్యమనే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది ఆపసోపాలు పడుతున్నారు. ఈ నెల 21న వైద్య సిబ్బంది అర్హతగల దంపతుల (ఈసీ)రిజిస్ట్రేషన్ కోసం వారి ఇంటి వద్దకు వెళ్లగా ఈ బాల్య వివాహ విషయం బయట పడింది. దీంతో వైద్య సిబ్బంది మహిళా పోలీసు ద్వారా పోలీసులకు, రెవెన్యూ అధికారులకు, వైద్యాధికారుల కు తెలియజేసి తదుపరి చర్యల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఆ బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భందాల్చలేదని నిర్ధారణ అయినట్లు తెలిసిం ది. చిన్న వయసులోనే ఆ బాలిక గర్భం దాల్చకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని పోవడంలో భాగంగా కొందరు వైద్య సిబ్బంది తహసీల్దార్‌ను కలవడానికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో సీనియర్ సహాయకునికి వివరాలు అందజేసి వెళ్లిపోయారు. తమ దృష్టికి రానంత వరకు పట్టించు కోకపోయినా కనీసం ఆ తర్వాతైనా పోలీసులు గాని, వైద్యాధికారులు గాని, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు గాని 4 రోజుల వరకు ఈ సంఘటనపై స్పందించకపోవడం అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పవచ్చు.


బాల్య వివాహంపై రెవెన్యూ అధికారులకు వివరిస్తున్న వైద్య సిబ్బంది

# భూ వివాదాలకు, సమస్యలకు పరిష్కారం చూపండి

**- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి, ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు అందించాలి - రామగిరి మండల అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే పరిటాల సునీత - సరైన వివరాలతో రాకపోవడంపై ఎమ్మెల్యే సునీత ఆగ్రహం**

రామగిరి, అక్టోబర్ 24 ప్రభాతవార్త

రామగిరి మండలంలోని భూ సమస్యలకు, వివాదాలకు వెంటనే పరిష్కా రం చూపాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. రామగిరి మండలానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్ర మాలు, పెండింగ్ లో ఉన్న పనులు, ప్రజా సమస్యల మీద సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని శాఖల అధికారులు సరైన వివరాలతో రాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక సమావేశానికి హాజరయ్యేటప్పుడు అధికారుల వద్ద సమగ్రమైన సమాచారం ఉండాలన్నారు. మండలంలో ఎన్ని ఎకరాల భూములకు సరిఅయిన రికార్డులు ఉన్నాయి. ఎన్ని ఎకరాలకు రికార్డులు సరిగా లేవన్న విషయంపై చర్చిం చారు. దీనిని వెంటనే జిల్లా కలెక్ట ర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే భూముల స్వాధీనంలో ఒకరు ఉంటే.. రికార్డుల్లో మరొకరి పేరు ఉందని ఇలాంటి తప్పిదాలు చాలా జరిగాయని.. వీటిపై చర్యలు తీసుకోవా లన్నారు. సోలార్ ప్రాజెక్టుల కోసం సాగులో లేని భూములను సేకరించాలని సూచించారు. ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు సేకరించారన్న దానిపై చర్చించారు. రేషన్ కార్డుల విషయంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాల న్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఉండాలన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో పురోగతి గురించి చర్చించారు. ఇప్పటివరకు ఎంత మందికి ఇళ్ల పట్టాలిచ్చారు.. అందులో ఎంత మంది ఇళ్లు నిర్మించుకు న్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేవలం పట్టాలు తీసుకున్న వారు, అర్హత లేని వారికి పట్టాలు ఇవ్వడం వంటివి గుర్తించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు అందేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో కమ్యూనిటీ హాల్స్, రోడ్లు, కల్వర్టుల నిర్మాణం గురించి చర్చించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఇంకా అర్హత ఉండి కూడా రాని వారి వివరాలు గురి ంచి తెలుసుకున్నారు. నవంబర్ నెలలో వారికి డబ్బు జమవుతుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు ఎంత మేర రుణాలు ఇచ్చారన్నది ఆరా తీశారు. అలాగే సరిగా పనిచేయని యానిమేటర్ల పై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ తరపున 68 ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఉన్న అన్ని రకాల పనులు వేగంగా జరగాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రులలో కూర్చోవడానికి పేషే ంట్లకు కుర్చీలు లేకపోవడం ఇతర సమస్యలు పరిష్కరి ంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. వచ్చే సమావేశానికి అధికారులంతా సమగ్రమైన వివరాలతో రావాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


కార్యక్రమానికి హాజరైన అధికారులు

# సామాజిక ప్రయోజనమే పరమావధి కావాలి..!

**ః యువతకు ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఉద్బోధ**

పెద్దపప్పూరు(తాడిపత్రి), అక్టోబరు 24, ప్రభాతవార్తః విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవరచుకొని సామాజిక ప్రయోజనమే పరమావధిగా కృషి చేయాలని ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి యువత కు ఉద్బోధించారు. మండల పరిధిలోని జేసీ దివాకర్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశ భద్రత కోసం, ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఆయన అన్నారు. పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో ఎన్నో అపాయాలను, కష్టాలను, సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు భద్రత కల్పిస్తుంటారని, సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పడా నికి ఆరోగ్యాలను పణంగా పెట్టి ఎల్లప్పుడూ అంకితభా వంతో పనిచేస్తారని ఆయన వివరిం చారు. విద్యార్థి దశ నుంచే యువత కూడా కష్టప దేతత్వం, క్రమశిక్షణ, సేవాభావం అలవరచుకొని భవిష్యత్తులో సమాజానికి ఉపయో గపడేలా తమ జీవితాలను తీర్చిదిద్దు కోవాలని ఆయన యువతకు సూచించారు. పోలీసుల సేవాస్ఫూర్తిని వివరిం చేలా యువతకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఉత్సా హంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తీకరించిన యువతలో ఉత్తమ విద్యార్థులను ఏఎస్పీ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జానకినాథరెడ్డి, సీఐ రామసుబ్బయ్య, ఎస్సై నాగేంద్రప్రసా ద్, పోలీసు సిబ్బంది జయన్న, నరసింహులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి


ఉత్తమ విద్యార్థిని అభినందిస్తున్న ఏఎస్పీ

# ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం ... ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం అక్టోబర్ 24ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో ఆలయాల అభివృద్ధికు కృషి చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివా సులు పేర్కొన్నారు శుక్రవారం వాసవి సేవ సమితి ఆధ్వర్యంలో రాయదుర్గంలో ఆర్య సంఘం నిర్మించిన నూతన కళ్యాణ మం డపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ... రుద్రయ్య శెట్టి 1960లో స్థలాన్ని కళ్యాణ మండపానికి ఉచితంగా ఇచ్చారని, నేడు తన హయాంలో ఇక్కడ కళ్యాణ మండటం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. జయంతి కుటుంబీకుల సహకారంతో కళ్యాణమండటం ఏర్పడిందన్నారు. జిల్లాలోనే రాయదుర్గం సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తన సంకల్పమన్నారు. అందులో భాగంగా మురడి ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ చేపట్టినట్లు చెప్పారు. అలాగే పశుపతినా థుడి ఆలయంతో పాటు ఇతరత్ర ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాయదుర్గం అభివృద్దే తన ఏకైక అజెండా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంగం, అనుబంధ సంగం నాయకులు గెల్లి లక్ష్మణా మూర్తి, తాయి రాజశేఖర్, తాయి శ్రీనివాసులు, జయంత్ సురేష్. తదితరులు పాల్గొన్నారు


కల్యాణమంటాపాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ కాలవ

# అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా వుండండి

**- పరివాహిక ప్రాంతాలైన నడిమివంక, మరువవంక పరివాహక ప్రాంతాలే ప్రధానం - అధికారులు నిర్లక్ష్యం వహించవద్దు -కమిషనర్ బాలస్వామి**

అనంతపురం అక్టోబరు24 ప్రభాతవార్త

అకాల వర్షాలు వస్తున్న తరుణంలో నగరంలో ప్రధాన మురికికాల్వలౌన నడిమివంక, మరువవంక పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికపుడు నీటి ప్రవాహాన్ని దృష్టిలో వుంచుకుని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆదేశించాడు. శుక్రవారం నగరంలోని 4,5వ రోడ్డు మధ్య వున్న హనుమాన్ కాల్వ వద్ద వర్షపు నీరు ప్రవహించకుండా అడ్డుగా వున్న పిచ్చిమొక్కలను, చెత్తా చెదారాలను జెసిబిల ద్వారా తొలగించారు. అలాగే పై ప్రధాన కాల్వల్లో మొత్తం పిచ్చి మొక్కలతో పాటు పేరుకుపోయిన చెత్తను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. తుఫాను ప్రభావం వల్ల నగర ప్రజలు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటానని ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులను కమిషనర్ హెచ్చరించాడు.


ప్రధాన మురికికాల్వల్లో పిచ్చి మొక్కల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి